ఉప్పు రైతుల నోట్లో మట్టి కొట్టిన వర్షం


మిగిలిన ఉప్పును ఒడ్డుకు చేర్చిన లీజుదారులు


కరిగిపోవడంతో ఊడ్చి గట్టున ఉంచిన ఉప్పు

తగరపువలస : ఎర్రటి ఎండ... ఆపై గాలులు... ఉప్పు సాగుకు అనుకూలమైన వాతావరణం. ఇలాంటి ప్రతికూలమైన వాతావరణంలో ఎలాంటి రక్షణ పరికరాలు లేకున్నా తెల్లటి పువ్వులాంటి నాణ్యమైన ఉప్పు పండించడానికి భీమిలి మండలం మూలకుద్దు ఉప్పు గల్లీల్లో లీజుదారులు ఆరుగాలం శ్రమిస్తుంటారు. చేతులతో ఉప్పును ఊడ్చి చేటలతో కావిళ్లకు ఎత్తి దూరంగా ఉన్న తీరానికి మోసుకొస్తుంటారు. ఈ ప్రక్రియలో కాళ్లు, చేతులకు మంటలు, ఉప్పుపై పడిన సూర్యరశ్మి కళ్లకు సోకి చూపు మసకబారడం వంటి సమస్యలు వీరికి సీజన్‌లో నిత్యకృత్యం. ఇక మబ్బు పట్టినా, వర్షం కురిసినా ఉప్పు సాగుకు ఆ ఏడాది బ్రేకులు పడినట్టే. మూలకుద్దులో స్థానిక పంచాయతీ వాసులు ఉప్పు సాగుపై శ్రద్ధ చూపకపోవడంతో రేఖవానిపాలెం, ఎస్సీ కాలనీ, బ్యాంకు కాలనీవాసులు మాత్రం కొనసాగిస్తున్నారు. పదుల సంఖ్యలో గల్లీలను లీజుకు తీసుకుని ఏటా దసరా తర్వాత సాగు ప్రారంభిస్తారు. ఎకరాకు రూ.50 వేలు వంతున పెట్టుబడులు పెట్టి సాగుకు దిగుతారు. వారి పంట పండి ఎండలు మెండుగా ఉంటే నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు సాగు చేస్తే ఖర్చులు పోను పెట్టుబడికి నాలుగింతలు మిగులుతుంది. మధ్యలో తుఫాన్లు పలకరిస్తే ఇక అంతే. సాధారణ సమయంలో తాపీమేస్త్రీలుగా పనిచేసే వారిలో ఎక్కువ మంది ఉప్పు సాగు చేస్తున్నారు.

ఎకరాకు 50 బస్తాలు కరిగిపోయింది..

బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు మడులలో పండిన ఉప్పు కరిగిపోయింది. ఎకరాకు 50 బస్తాల వంతున రూ.17,500 నష్టపోయారు. ప్రస్తుతం గల్లీలలో రైతులు మొత్తంగా రూ.5 లక్షల వరకు నష్టపోయినట్టు అంచనా. ప్రస్తుతం 50 కిలోల బస్తా రూ.350 ఉండగా వర్షాలు ప్రారంభమైతే రూ.450కు చేరుకుంటుంది. చీపురుపల్లి, పూడిమడక, పరవాడ, నొపడ తదితర ప్రాంతాల నుంచి పోటీ ఎక్కువగా ఉన్నందున గత ఏడాది పంటలో ఒక్కో రైతు వద్ద 200 బస్తాల వరకు ఉప్పు మిగిలిపోయింది. మార్చి, ఏప్రిల్ నెలలో పండే ఉప్పు నాణ్యంగా ఉండడంతో దానిని ఆహారంలోకి వినియోగిస్తుంటారు. మిగిలిన రోజుల్లో పంటను సీఫుడ్స్, పశువులు, కోళ్ల దాణా, కొబ్బరి తోటలకు వినియోగిస్తుంటారు.


మూలకుద్దులో వర్షం నీటిలో ఉప్పు గల్లీలు


మడులలో కరిగిపోయిన ఉప్పు


గత ఏడాది విక్రయించగా మిగిలిన ఉప్పు


కావిడతో ఉప్పును ఒడ్డుకు చేరుస్తున్న లీజుదారు

తాపీమేస్త్రిగా పని చేస్తూ...



తాపీమేస్త్రిగా పనికి వెళ్తే రోజుకు రూ.1000 వస్తుంది. ఏటా ఉప్పు సాగులో అదృష్టాన్ని పరీక్షించుకుంటాం. ఎండలను సైతం ఖాతరు చేయకుండా కుటుంబం మొత్తం పనిచేస్తే రోజుకు రూ.1000కి పైగా ఆదాయం వస్తుంది. ఇటీవల పోటీ పెరగడంతో అమ్మకాలు పడిపోయాయి.

– సమ్మిడి శ్రీను

వర్షాలు కొంప ముంచాయి



సాధారణంగా వర్షాలు ఆలస్యమైతే జూలై వరకు ఉప్పు పండుతుంది. ఒకసారి వర్షం ప్రారంభమై మళ్లీ ఎండలు గట్టిగా కాస్తే మొదటి పంటకు 20 రోజులు పడుతుంది. ఈసారి రుతుపవనాలు త్వరగా రావడంతో ఇక సాగు ఆగిపోయినట్టే. ఈ ఏడాది ఆదాయం తగ్గిపోతుంది.

– తెరికోటి శ్రీను

ఉప్పు సాగే జీవనాధారం



నాకు మొదటి నుంచి గల్లీలలో ఉప్పు సాగే అలవాటు. నీరు పెట్టడం, ఇగరగట్టడం, పండిన ఉప్పును పోగు చేయడం, కావిళ్లకు ఎత్తడం, మోత, లోడింగ్ ఈ పనులే 8 నుంచి 10 నెలల వరకు గల్లీలో ఉంటాయి. గతంలో ఎక్కువ మంది పని చేసేవారు. కష్టంగా ఉండటంతో చాలా వరకు మానేశారు. ఇదే నాకు జీవనాధారం.

– సమ్మిడి నూకరాజు

క్లుప్తంగా

రసాయన శాస్త్రంతో ఉజ్వల భవిత

కొమ్మాది: పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం బోధన, పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తోందని గీతం రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్‌వీఎస్ వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు గురువారం నిర్వహించిన 'రసాయన శాస్త్రం – ఉజ్వల భవిష్యత్' అనే సదస్సులో ఆయన ప్రసంగించారు. ఔషధ రంగం నుంచి అణు ఉత్పాదన రంగం వరకు రసాయన శాస్త్రం విస్తరించిందన్నారు. ఔషధ పరిశ్రమలు లారస్ ల్యాబ్, రెడ్డీస్ ల్యాబ్, ఫైజర్ హెల్త్‌కేర్‌తో తమ విభాగానికి అవగాహన ఒప్పందాలు ఉన్నాయని పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


డివైడర్ దాటి దూసుకుపోయిన కారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ వద్ద ఓ కారు అతి వేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను దాటి దూసుకుపోయింది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. భీమిలి నుంచి వైజాగ్ వైపు వస్తున్న కారు సాగర్‌నగర్ బస్టాప్ సమీపంలో అదుపు తప్పింది. కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారని, వారిలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మద్యం సేవించడంతో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలుపారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

18న కంటి వైద్య శిబిరం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో ఈ నెల 18న విశాఖ కంటి ఆస్పత్రి, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నిర్వహించే శిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వనున్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నంబర్, రెండు జతల దుస్తులు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. వివరాలకు 85002 64289, 98857 03365, 76610 20763 లో సంప్రదించాలని కోరారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు


చందకలో డెంగ్యూ వ్యాధి నివారణ ర్యాలీ ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు, తదితరులు

తగరపువలస : దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. గురువారం ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం చందక పంచాయతీలో ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని కోరారు. క్షయ వ్యాధి నివారణ టీకాల రాష్ట్ర పర్యవేక్షకురాలు డాక్టర్ నిర్మల గౌరి మాట్లాడుతూ లార్వా దశలోనే దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణేంద్రబాబు, ఉమావతి, గంగునాయుడు, షెహనాజ్ సాధియా, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పంపించాలి

పద్మనాభం : జ్ఞానం పెంచుకునేందుకు విద్యార్థులను గ్రంథాలయాలకు పంపించాలని ఎంఈవో పి.రమణ సూచించారు. పద్మనాభంలోని శాఖ గ్రంథాలయంలో జూన్ 7 వరకు నిర్వహించనున్న శిక్షణ శిబిరానికి పది నుంచి 15 ఏళ్ల లోపు వయసు గల విద్యార్థులను పంపించాలని కోరారు. శిబిరం రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు కొనసాగుతుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస : జీవీఎంసీ 4వ వార్డు 33 కేవీ పాత పరదేశిపాలెం – బోయపాలెం – కాపులుప్పాడ లైన్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, మంగమారిపేట, తిమ్మాపురం, కె.నగరపాలెం, కాపుల దిబ్బడిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పద్మనాభం : పద్మనాభం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రౌతులపాలెం ఫీడర్ లైనులో చెట్ల కొమ్మలు తొలగించడం, ఇతర పనులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం ఆపరేషన్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రౌతులపాలెం, రేవిడి, రౌతులపాలెం కాలనీ, బర్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

హిందీ విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించే పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు గురువారం భీమిలిలో ప్రారంభించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విజయనగరం పూసపాటి విజయరామ గజపతిరాజు ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ జి.ఎల్.ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం మంది హిందీ భాషను అనర్గళంగా మాట్లాడుతున్నారన్నారు. హిందీ నేర్చుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. జూన్ 12 వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. కృష్ణారావు మాట్లాడుతూ తొమ్మిది పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, ప్రవేశిక, రాష్ట్ర భాష, రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు

తగరపువలస : ఇటీవల ప్రకటించిన సీబీఎస్‌ఈ 10, 12వ తరగతులకు సంబంధించి ఉత్తమ ఫలితాలు సాధించిన తమ విద్యార్థులను భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అభినందించింది. 12వ తరగతిలో కోట మేఘన కెమిస్ట్రీలో నూరుశాతం మార్కులు సాధించగా ఎస్.నిధి 94 శాతం మార్కులు సాధించినట్టు తెలిపారు. 10వ తరగతిలో మహాలక్ష్మి 93.40 శాతం, సోహన్ సాహూ 92.80 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల, డైరెక్టర్ అమిత్‌కుమార్ జైన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువులోనే కాకుండా మిగిలిన రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. తమ వద్ద అనుకూలమైన అభ్యసన వాతావరణం కల్పిస్తున్నట్టు తెలిపారు.

రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు

తగరపువలస : వర్షాలు కురిసిన ప్రతిసారీ సంగివలస చెరువు నుంచి నీరు సర్వీస్ రోడ్డుపై రెండు అడుగుల మేర నిలిచిపోతోంది. దీంతో సంగివలస ఫ్లై ఓవర్ కింద గుంత ఏర్పడింది. తగరపువలస సర్వీస్ రోడ్డు నుంచి సంగివలస సర్వీస్ రోడ్డులోకి వెళ్లే వాహనదారులు ఈ ఫ్లై ఓవర్ కింద నుంచి రాకపోకలు సాగించాల్సి వుంటుంది. ఈ సమయంలో సర్వీస్ రోడ్డులో ఇరువైపుల నుంచి వచ్చే వాహనాలను గమనిస్తూ ఈ గుంతలో వాహనదారులు దిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.


సంగివలస ఫ్లై ఓవర్ కింద ఏర్పడిన గుంత

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు


శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, బుత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ఠ జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తితో సాయినామ పఠనం


సాయినామ పఠనం చేస్తున్న భక్తులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవం నేపథ్యంలో గురువారం శ్రీ శిర్డీ సాయి నామ పఠనం భక్తులు అత్యంత భక్తి భావంతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆశ్రమ ప్రాంగణంలో సాయినాథుని భజన చేశారు. ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు యోగారాజు, భక్తులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించాలని వినతి

భీమునిపట్నం : భీమిలి బీచ్ సమీపంలో ఉన్న అయ్యప్ప దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కొన్ని ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌ను వెంటనే తొలగించాలని భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు గురువారం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వల్ల ఆధ్యాత్మిక చింతనకు ఆటంకం కలుగుతోందని, మాంసాహార తినుబండారాలు ఇక్కడ విక్రయించడం వల్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సేవా సంఘం సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వీఆర్‌వో మృతి

అనకాపల్లి: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండలంలోని మాకవరం వీఆర్‌వో బి.కృష్ణారావు గురువారం మృతిచెందినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. హెచ్‌సీ రామకృష్ణ కథనం మేరకు భీమునిపట్నం మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన బి.కృష్ణారావు(62) అనకాపల్లి మండలం మాకవరం వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. విధినిర్వహణలో భాగంగా గత నెల 29న అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో కార్యాలయం వద్ద ఫిట్స్ వచ్చి పడిపోయారు. దీంతో కృష్ణారావు తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మృతుడి అన్నయ్య పైడయ్యనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

బీసీజీ టీకాలతో క్షయ వ్యాధిని నివారిద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు


బీసీజీ టీకా వేయిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు, తదితరులు

తగరపువలస : క్షయ వ్యాధి నివారణకు పెద్దలంతా బీసీజీ టీకాలు వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. గురువారం ఆయన ఆనందపురం మండలంలో బీసీజీ టీకాలు వేసే కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకురాలు నిర్మలగౌరితో కలిసి పర్యవేక్షించారు. చందక, బోయపాలెం పంచాయతీల్లో ఈ కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 60 ఏళ్లు నిండిన వారు, మధుమేహ బాధితులు, బీఎంఐ 18 లోపు ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారికి క్షయ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర పరిశీలకురాలు నిర్మలగౌరి మాట్లాడుతూ ప్రజలు క్షయ వ్యాధి బారిన పడకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గురువారం టీకాలు వేయాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో క్షయ నివారణ మండల అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమావతి, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షెహనాజ్ సాదీయ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, జిల్లా కేంద్ర ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ సురేష్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి బీసీజీ టీకాలు

మధురవాడ : మధురవాడ యూపీహెచ్‌సీలో గురువారం 200 మందికి బీసీజీ టీకాలు వేసినట్టు ఆర్‌టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు, గత ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిన వారు, పొగ తాగేవారు, షుగర్ వ్యాధి ఉన్నవారు, బీఎంఐ 18 కంటే తక్కువ ఉండే వారు టీకా వేయించుకోవాలని సూచించారు.


మధురవాడ యూపీహెచ్‌సీలో టీకా వేస్తున్న సిబ్బంది

డ్రైనేజీపై పలకలు శిథిలం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు జాతీయ రహదారిని ఆనుకుని రామన్నపేట – బంగ్లామెట్ట మార్గంలో డ్రైనేజీపై సిమెంట్ పలకలు విరిగిపోయి అందులో పడిపోయాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు అప్రమత్తంగా లేకపోవడంతో తరచూ అందులో పడిపోయి గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా చీకటి వేళ అయోమయానికి గురై అందులో పడిపోతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది జోక్యం చేసుకుని శిథిలమైన సిమెంట్ పలకలను డ్రైనేజీపై పునరుద్ధరించాలని కోరుతున్నారు.


బంగ్లామెట్ట – రామన్నపేట మార్గంలో డ్రైనేజీపై శిథిలమైన సిమెంట్ పలకలు

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజారుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


కనకమహాలక్ష్మి అమ్మవారు